క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి కృషి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్‌లు, గ్రామపెద్దలు

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని గొల్లపల్లి మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. మండలంలోని గొల్లపల్లి అనుబంధ గ్రామమైన ధర్మసాగర్‌లో హెచ్‌ఎండీఏ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను స్థానిక ప్రజలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయన్నారు. ప్రభుత్వ సహకారంతో గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రాజీరెడ్డి, రాంచంద్రారెడ్డి, విఘ్నేశ్‌గౌడ్, గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు ఉన్నారు.

పాఠశాలకు రంగులు



రంగులతో కళకళలాడుతున్న పాఠశాల భవనం

కొందుర్గు: నిన్నమొన్నటివరకు బోసిపోయిన పాఠశాల భవనం శనివారం కొత్త రంగులతో కళకళలాడుతోంది. మండలంలోని మహదేవ్‌పూర్ పాఠశాల భవనం పాతబడి నల్లగా మారింది. ఈ విషయమై ఉపాధ్యాయులు, గ్రామస్తులు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బోడంపాటి రవీందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి పాఠశాల భవనానికి సొంత ఖర్చులతో రంగులు వేయించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందించారు.

ముగిసిన జోనల్‌స్థాయి క్రీడాపోటీలు



కొందుర్గులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ గాయత్రీదేవి

కొందుర్గు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన 69వ జోనల్ స్థాయి క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీలకు నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరై తలపడ్డారు. ఎంఈఓ గాయత్రీదేవి పోటీలను ప్రారంభించారు. వాలీబాల్ అండర్–17 బాలుర విభాగంలో కొందుర్గు ప్రథమ బహుమతికి ఎంపిక కాగా, కేశంపేట ద్వితీయ బహుమతికి ఎంపికైంది. అదేవిధంగా బాలికల విభాగంలో కొత్తూరు ప్రథమ, చౌదరిగూడ ద్వితీయ, కబడ్డీ అండర్–14 బాలుర విభాగంలో ఫరూఖ్‌నగర్ ప్రథమ, కేశంపేట ద్వితీయ, బాలికల విభాగంలో ఫరూఖ్‌నగర్ ప్రథమ, కొత్తూరు పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో కొందుర్గు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోపినాథ్, క్రీడాపోటీల జోనల్ సెక్రటరీ బాలయ్య పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

ఆమనగల్లు: విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులందరూ కష్టపడి చదువుకోవాలని తలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఫ్రెషర్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిననాటి నుంచే పట్టుదల, క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. యుక్త వయసులో దురలవాట్లకు లోనుకాకుండా.. విద్యనభ్యసించి ఉన్నతంగా రాణించాలన్నారు. అనంతరం కళాశాలకు రూ.5 లక్షల విలువైన మెటీరియల్ బహూకరించిన ఉన్నతి, శిక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుధాకర్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ అంజయ్య, మాజీ సర్పంచ్‌లు జోతయ్య, రఘుపతి, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, కళాశాల సిబ్బంది కృష్ణకాంత్, షణ్ముకరెడ్డి, సాయి రణీష, విజయ్‌కుమార్, సంతోష్‌కుమార్, పరమేశ్, వెంకన్న, పద్మ, గార్గేయి, యాదయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

- పల్స్ పోలియోకు సర్వం సిద్ధం
- నియోజకవర్గ పరిధిలో 35,267 మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తింపు



పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ(ఫైల్)

షాద్‌నగర్: పోలియోను శాశ్వతంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం పల్స్ పోలియో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలను వేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నారు.

ఇలా వైరస్ వ్యాప్తి

తాగే నీరు, ఆహారం కలుషితం కావడం ద్వారా వైరస్ వచ్చిన వారి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. వైరస్ శరీరంలోకి ప్రవేశించిన 7 నుంచి 15 రోజుల్లో లక్షణాలు కనిపిస్తాయి. అకస్మాత్తుగా జ్వరం, తల, గొంతు, పంటి నొప్పులు రావడం, వికారం, వాంతులు, విరోచనాలు మొదలవుతాయి. జ్వరం వచ్చిన రెండు రోజుల నుంచి ఏడు రోజులలోపు కాలు ఈడుస్తూ నడుస్తున్నా.. చేతులు వాలిపోయినట్లు చేస్తున్నా.. చిన్నారులు ఏడ్చిన సమయంలో పొట్టలో ఓ వైపు ఉబ్బుతుంటే పోలియో జబ్బు ప్రారంభ దశలో ఉన్నట్లు గుర్తించాలి. కండరాల బలహీనత వచ్చి కాళ్లు, చేతుల్లో పట్టుత్వం కోల్పోతారు. నడుము, పొట్ట కండరాలకు సైతం పక్షవాతం వచ్చే అవకాశాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. కొందరికి ఫిట్స్ సైతం రావొచ్చు.

వ్యాక్సిన్ పంపిణీ ఇలా

షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు, నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల పరిధిలో 1 నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు మొత్తం 35,267 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నియోజకవర్గంలో వ్యాక్సిన్ వేసేందుకు 29 రూట్లలో 289 బూతులను ఏర్పాటు చేశారు. ఇందులో మొత్తం 1252 ఆరోగ్య సిబ్బంది పని చేయనున్నారు. అదేవిధంగా ఆరు మొబైల్ బృందాలతో పాటుగా 11 ట్రాన్సిస్టర్ (బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో) పాయింట్లు ఏర్పాటు చేశారు.

సిబ్బందికి అవగాహన

పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంపై ఆరోగ్య సిబ్బందికి ఇప్పటికే ఉన్నతాధికారులు శిక్షణా తరగతులు నిర్వహించారు. చిన్నారుల గుర్తింపు, రికార్డుల నిర్వహణ, ఇంటింటి సర్వే వంటి కార్యక్రమాలు ఏ విధంగా చేయాలన్న అంశాలపై అవగాహన కల్పించారు. పల్స్ పోలియోను విజయవంతం చేసేందుకు 29 మంది రూట్ సూపర్‌వైజర్లను నియమించారు. పల్స్ పోలియో కార్యక్రమంలో పోలియో చుక్కలు వేసుకోని వారికి ఈనెల 13, 14 తేదీల్లో ఆరోగ్య సిబ్బందికి ఇంటింటికి సర్వే నిర్వహించి పోలియో చుక్కలు వేయనున్నారు.

పోలియో రహిత సమాజం నిర్మిద్దాం

పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి. పోలియో డ్రాప్స్ వేయించి చిన్నారులకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించాలి. ఇందుకు అందరు తగిన విధంగా కృషి చేయాలి.

–శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్

డ్రాప్స్ విధిగా వేయించాలి



ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేందుకు తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి. ప్రస్తుత ఆస్పత్రుల్లో, రద్దీ ప్రాంతాల్లో, పంచాయతీ కార్యాలయాల్లో పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. పోలియో రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలి

– డాక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలి

ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె



ప్రిన్సిపాల్, అధ్యాపకులతో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థినులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు సేవాదృక్పథాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అఫ్రోజాహన్ ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని కమ్మదనంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శీతకాల శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నీతాపోలె హాజరై కార్యక్రమాన్ని ప్రాంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి విద్యతో పాటు సామాజిక సేవపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సమాజంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. బాల్య వివాహాలతో భవిష్యత్ నాశనం కావడంతో పాటు ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. విద్యార్థినులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి స్థిరపడిన తర్వాతే వివాహం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు అరుణ అంజయ్యగౌడ్, మాజీ ఉపసర్పంచ్ అమర్నాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జగదీశ్వర్, అధ్యాపకులు కళాజ్యోతి, పరమేశ్వరి, విద్యార్థినులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యపై దృష్టి అవసరం

ఎంఈఓ మల్లయ్య



శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో ఎంఈఓ మల్లయ్య

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతికతను పెంచి విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించాలని ఎంఈఓ మల్లయ్య సూచించారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు డిజిటల్ లెర్నింగ్, కోడింగ్, పైథాన్ ప్రోగ్రామింగ్, ధోనీ ప్రోగ్రామింగ్‌పై మూడురోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మారుతున్న టెక్నాలజీపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకొని వాటిని విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. బహుళ ప్రయోజనాలతో కూడిన డిజిటల్ పాఠాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యం పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్, డీఆర్పీ సిద్ధం శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్లు బాలమణి, అంజిలప్ప, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు



ఎస్‌బీపల్లి శివారులో ప్రమాదకరంగా మలుపు

కొత్తూరు: పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లలో ప్రమాదకరంగా మారిన మూలమలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరిగి వాహనదారులు మృత్యువాతపడుతున్న సంఘటనలు ఆయా ప్రాంతాల్లో చోటు చేసుకుంటున్నాయి. అయినప్పటికీ మండలంలో మలుపులను గుర్తించి కనీస రక్షణ చర్యలు చేపట్టడంలో సంబంధిత శాఖ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొత్తూరు నుంచి సిద్ధాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో ఎస్‌బీపల్లి శివారులో ఓ మలుపు వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారింది. అక్కడ వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదాలకు గురవుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు వేగ నిరోధకాలు, ప్రమాద సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

హెచ్‌ఎం రసూల్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు మత్తు బారిన పడి తమ విలువైన భవిష్యత్తును చిత్తు చేసుకోవద్దని ప్రధానోపాధ్యాయుడు రసూల్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ జెడ్పీ హెచ్‌ఎస్‌లో యూట్యూబర్ తల్వార్‌తాతతో కలిసి ఆయన మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తల్వార్ తాత పల్లెటూరి భాషలో తన ఆటాపాటలతో, సన్నివేశాలతో చెడు వ్యసనాలతో కలిగే అనర్థాలు, విద్య ఆవశ్యకతను తెలియజేస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు ఆకర్షితులైతే జీవితం నాశనమవుతుందన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. సామాజిక సేవా దృక్పథంతో తల్వార్ తాత పాఠశాలకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీపరీక్షల్లో పాల్గొనాలి



మాట్లాడుతున్న ఎంఈఓ మనోహర్

ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఎంఈఓ మనోహర్ అన్నారు. శనివారం పట్టణంలోని నారాయణ పాఠశాలలో మహబూబ్‌నగర్ జోనల్‌స్థాయి మాస్టర్ ఓరేటర్ కాంటెస్ట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు షాద్‌నగర్, వనపర్తి విద్యార్థుల మధ్య హోరాహోరీగా సాగింది. ఈ కార్యక్రమానికి ఎంఈఓ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యనభ్యసించాలన్నారు. ఇలాంటి పోటీపరీక్షలు విద్యార్థుల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయన్నారు. పోటీ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ జీఎం గోపాల్‌రెడ్డి, డీజీఎం వెంకట్‌రెడ్డి, జ్యూరీ సభ్యులు శ్రీకాంత్, మచ్చేందర్, స్వాతి, గౌతమి, ఆర్డీ అనిల్‌కుమార్, హెచ్‌ఆర్ సతీశ్, కో–ఆర్డినేటర్ నితిన్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మాధవి, ఏఓ శ్రీధర్, అకాడమిక్ డీన్ అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగికి విరమణ సహజం

పంచాయతీరాజ్ డీఈఈ గణేశ్, ఎస్‌టీఓ లక్ష్మణ్



పీఆర్ సీనియర్ అసిస్టెంట్ ప్రేమలత దంపతులను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

చేవెళ్ల: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనేది సహజమేనని పంచాయతీరాజ్ డీఈఈ గణేశ్, చేవెళ్ల ఎస్టీఓ లక్ష్మణ్ అన్నారు. మండల పరిధిలోని ఓ ఫాంహౌజ్‌లో శనివారం ఇటీవల పదవీ విరమణ పొందిన పీఆర్ డిపార్టుమెంట్ సీనియర్ అసిస్టెంట్ ప్రేమలత పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమలత స్టీవెన్ దంపతులను ఆయా శాఖల అధికారులు, సిబ్బంది బంధువులు ఘనంగా వీడ్కోలు తెలిపి సన్మానం చేశారు. అందరితో కలిసి మెలసి ఉంటూ అందరినీ ఆప్యాయంగా పలకరించే ప్రేమలత పదవీ విరమణ అతనంతరం శేషజీవితం ఆనందంగా గుడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఈ ప్రభాకర్, అధికారులు ఆశాజ్యోతి, హనీష, ప్రశాంత్, శ్రీనివాస్, వికారాబాద్ జిల్లా డీపీఆర్‌ఓ ప్రభాకర్, రిటైర్డు డీఈఈ జగన్‌రెడ్డి, నాయకులు పి.ప్రభాకర్, మోకురం నర్సింలు, జీరాజు, బంధువులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులతో స్టూడెంట్ ఫోర్స్ సంస్థ ప్రతినిధులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల ప్రాథమిక పాఠశాలలో శనివారం విజ్ఞానజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన స్టూడెంట్ ఫోర్స్ సంస్థ సహకారంతో ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళాశాలలో విద్యార్థులు రాసిన రికార్డుల పేపర్లను రీసైక్లింగ్ ప్రాసెస్‌చేసి కొత్త పేపరుగా తయారు చేశామన్నారు. ప్రతి విద్యార్థి రెడ్యూస్, రీయూస్, రీసైక్లింగ్ గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రధానంగా ఆడపిల్లలు తప్పనిసరిగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల సిబ్బంది దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రీతిబాల, రవికుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సుజాత, ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ప్రోగ్రాం మేనేజర్ మురళీకృష్ణ, సభ్యులు ప్రగతి, లావణ్య, తులసి, శ్రీకాంత్, సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయండి

శంకర్‌పల్లి: నేటి నుంచి మూడురోజుల పాటు శంకర్‌పల్లిలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రేవతీరెడ్డి తెలిపారు. పుట్టిన పిల్లల నుంచి 5 ఏళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పట్టణ పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 5,492 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించామని, అందుకుగాను 34 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు ఆమె స్పష్టం చేశారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి



షాద్‌నగర్: మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

షాద్‌నగర్: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి అన్నారు. పోషణ మాసం కార్యక్రమాన్ని శనివారం ఫరూఖ్‌నగర్‌లోని గుండుగేరి కమ్యూనిటీ హాల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యంగా చిన్నారులు, బాలింతలు, గర్భిణుల విషయంలో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారాన్ని పంపిణీ చేస్తోందన్నారు. చిన్నారులకు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే తల్లిదండ్రులు సమీపంలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేయించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. అదేవిధంగా గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసూతి చేయించుకోవాలని, తద్వారా ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ సువర్ణ, వెంకటమ్మ, అలియా సుల్తానా, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చేవెళ్ల ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సీడీపీఓ హెప్జిబా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, ఆరునెలల చిన్నారులకు అన్నప్రాసన, పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమాలు చేశారు. తల్లులు తమ ఆహారంలో చక్కెర, నూనె వినియోగాన్ని తగ్గించుకోవడం ద్వారా ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవచ్చని సూచించారు. అదేవిధంగా పోషకాహార ప్రాముఖ్యతను వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సృజనవాణి, జ్వాలరాణి, పారిజాత, ఏఎన్‌ఎంలు సుజాత, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

చిరుధాన్యాలు విధిగా తీసుకోవాలి



కొందుర్గు: పోషకాహార వారోత్సవాల్లో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు



షాబాద్: చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ హెప్జిబా, సూపర్‌వైజర్లు

కొందుర్గు: గర్భిణులు, బాలింతలు ప్రతిరోజు భోజనంలో చిరుధాన్యాలు, గుడ్లు, పాలు విధిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీత సూచించారు. శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఇంద్రానగర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనుసూజ, ఊర్మిళ, వసంత, ప్రమీల, పుష్ప, శోభారాణి, కవిత, భారతి, మంగమ్మ, విజయ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



షాద్‌నగర్‌రూరల్: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ అండాలు

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అండాలు సూచించారు. పోషణ మాసంలో భాగంగా శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలింతలు, గర్భిణులు పాలు, పండ్లు, గుడ్లు, ఆకుకూరలు, చిరుధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. పోషకాహారంతోనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజ్, అంగన్‌వాడీ టీచర్లు హేమలత, సుజాత, సమిత, పద్మావతి, పార్వతి, కవిత, స్వాతి, రంగమ్మ, సక్కుబాయి, అంగన్‌వాడీ ఆయాలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.